నీటిని నింపి.. దప్పిక తీర్చి



భీమారం: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని మంచిర్యాల అటవీ డివిజన్‌లోని భీమారం రిజర్వుఫారెస్ట్‌లో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు అటవీశాఖ అధికారులు కుంటను నిర్మించి అందులో నీటిని నింపారు. దుప్పులు, ఇతర జంతువులు అడవుల్లో నీటి లభ్యత లేకపోవడంతో గ్రామాల్లోకి వస్తుండడంతో నీటి కుంటల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. మిషన్ భగీరథ నీటిని పైపుల ద్వారా కుంటలోకి తరలించి వన్యప్రాణులకు మేలు చేస్తున్నారు. మరిన్ని నీటికుంటలు ఏర్పాటు చేసి దాహార్తి తీర్చనున్నట్లు అటవీ రేంజ్ ఆఫీసర్ రత్నాకర్ రావు 'సాక్షి'కి తెలిపారు.

కనికరించండి.. కష్టాలు తీర్చండి



భీమిని: నీటి కష్టాలు తీర్చాలంటూ కన్నెపల్లి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ ప్రజలు కోరుతున్నారు. ఎస్సీ కాలనీలో కొంతకాలంగా నీరు రాకపోవడంతో దూరంగా ఉన్న బోర్లు, బావుల వద్ద నీటిని తెచ్చుకుంటున్నట్లు ఆ కాలనీవాసులు పేర్కొంటున్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదంటూ వాపోతున్నారు. ఇప్పటికైనా నీటి సమస్యను దృష్టిలో పెట్టుకొని ఎండాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో కాలనీకి కొత్త పైప్‌లైన్ వేసి సమస్య తీర్చాలని కోరుతున్నారు.

రోడ్డు విస్తరణ పనులు షురూ..



మంచిర్యాలటౌన్: పట్టణంలోని ఐబీ చౌరస్తా నుంచి శ్రీనివాస గార్డెన్ వరకు రోడ్డు విస్తరణకు ఎట్టకేలకు చర్యలు చేపట్టారు. గతేడాది రోడ్డు విస్తరణకు రూ.35కోట్లు మంజూరయ్యాయి. రోడ్డు మధ్య డివైడర్ నుంచి ఇరువైపులా 66ఫీట్లకు మార్కింగ్ చేస్తున్నారు. మొత్తంగా 132ఫీట్ల వెడల్పుతో రోడ్డు ఉండేలా మార్కింగ్ చేస్తున్నారు. మార్కింగ్ లోపల ఉన్న టేలాలు, షెడ్లను తొలగించడంతోపాటు, అప్పటికే కట్టిన భవనాలకు కార్పొరేషన్ అధికారులతో నోటీసులు ఇప్పించనున్నారు. మార్కింగ్ పూర్తైన వెంటనే పనులు ప్రారంభిస్తామని రోడ్లు భవనాల శాఖ డీఈ భాష్‌సింగ్ తెలిపారు.

సామూహిక వ్రతాలు



మంచిర్యాలఅర్బన్: మాఘపౌర్ణమి సందర్భంగా మంచిర్యాల గోదావరి నది తీరాన గౌతమేశ్వర ఆలయంలో బుధవారం వాసవిక్లబ్ ఆధ్వర్యంలో 152మంది ఆర్యవైశ్య దంపతులతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. గడియారం బాలాజీ శర్మ వేదమంత్రాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు అంగరంగవైభవంగా జరిపారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, కార్యక్రమ చైర్మన్ పి.శ్రీనివాస్, ఆలయ సభ్యురాలు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

కనుల పండువగా హోమం



యజ్ఞం చేస్తున్న భక్తులు

జన్నారం: మండలంలోని కలమడుగు శ్రీ నరనారాయణ స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం భక్తులు యజ్ఞాలు చేశారు. 21జంటల భక్తులతో ఆలయ పూజారులు కాకర నర్సయ్య, రాజనరేంద్ర శర్మ వేద మంత్రోచ్చరణల మధ్య హోమాలు కాల్చారు. ఆలయ కమిటీ భక్తులకు నెయ్యి, నవధాన్యాలు, సమితలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ స్వదేశ్‌కుమార్, కమిటీ సభ్యులు అంజగౌడ్, శంకరయ్య, విష్ణు, మల్లేశ్, రంగయ్య, భూమన్న తదితరులు పాల్గొన్నారు.
– ఆలయంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్య జాన్సన్‌నాయక్, మాజీ జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి రాజనరేంద్ర శర్మ స్వామికి పూజలు చేసి తీర్థ, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ స్వదేశ్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు సంతోష్‌కుమార్, జనార్దన్, శ్రీనివాస్, ఫజల్ ఖాన్, మున్వర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కాకో విగ్రహ పునఃప్రతిష్టాపన



దండేపల్లి: మండలంలోని గుడిరేవు గోదావరి నది ఒడ్డున శ్రీపద్మల్‌పురి కాకో ఆలయంలో కాకో అమ్మవారి నూతన విగ్రహాన్ని బుధవారం పునఃప్రతిష్టాపన చేశారు. ఆదివాసీ సంప్రదాయ ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి కాకోను దర్శించుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సహకార సంఘం చైర్మన్ తిరుపతి, ఆలయ కమిటీ చైర్మన్ సోము, కులపెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుడి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

రామకృష్ణాపూర్: మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని మందమర్రి మండలం బొక్కలగుట్ట గ్రామంలోని రుశ్యముఖ పర్వతంపై బుధవారం వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి, అలివేలు మంగ విగ్రహాలను గ్రామస్తులు పర్వతంపైకి తీసుకువచ్చిన అనంతరం కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. అంతకుముందు పర్వతం చుట్టూ గిరి ప్రదిక్షణ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మైసమ్మ జాతర ఏర్పాట్లు పరిశీలన

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్ట శివారులోని గాంధారిఖిల్లాలో నిర్వహించే గాంధారి మైసమ్మ జాతర ఏర్పాట్లను మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజు బుధవారం పరిశీలించారు. ఈ నెల 14, 15, 16తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించే జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉండటంతో పలు అంశాలపై చర్చించారు. జాతర ప్రాంగణం, ఖిల్లాపైకి వెళ్లి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులు పార్కింగ్ స్థలంలోనే వాహనాలు నిలుపాలని సూచించారు. భద్రతాపరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణ ఎస్సై రాజశేఖర్, నాయక్‌పోడ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రహరీల నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో?

- 168పాఠశాలలకు మంజూరు
- 70పూర్తి, 98చోట్ల కొనసాగుతున్న పనులు

చెన్నూర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల భవనాల చుట్టూ ఎలాంటి ప్రహరీలు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. పశువులు, శునకాలు, పాములు పాఠశాల ఆవరణల్లో సంచరిస్తున్నాయి. దీంతో ప్రభుత్వం ప్రహరీల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. మంచిర్యాల జిల్లాలోని 16మండలాల్లో 168పాఠశాలలకు ప్రహరీలు నిర్మించాలని గతంలో ప్రతిపాదనలు పంపించగా, రెండు నెలల క్రితం మంజూరు చేసింది. ఇప్పటివరకు 120పాఠశాలల్లో మాత్రమే ప్రహరీల నిర్మాణాలు ప్రారంభం కాగా, 70 పూర్తయ్యాయి. 98చోట్ల కొనసాగుతున్నాయి. మంజూరైన ప్రహరీల నిర్మాణాలకు పంచాయతీ అధికారులు తీర్మానం చేసి పనులు అప్పగించాలి. నిధులు కూడా పంచాయతీల ఖాతాల్లోనే జమవుతాయి. పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడం, ప్రత్యేకాధికారుల పాలన సాగుతుండటంతో పనులు ముందుకు సాగడం లేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. మార్చి 31లోపు పనులు ప్రారంభించకపోతే పనులు నిలిచిపోయే అవకాశాలున్నాయి. సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి పనులు ప్రారంభం కానీ చోట పనులు ప్రారంభించి, పనులు ప్రారంభమైన చోట త్వరగా పూర్తి చేయించాలని పలువురు కోరుతున్నారు.



బుద్దారంలో ప్రహరీ పనులను పరిశీలిస్తున్న ఈసీ

మార్చి 15 వరకు పనులు పూర్తయ్యేలా చూస్తాం



జిల్లా వ్యాప్తంగా 168పాఠశాలలకు ప్రహరీలు మంజూరయ్యాయి. కొన్నిచోట్ల నిర్మాణాలు పూర్తి కాగా, మరికొన్ని చోట్ల పనులు జరుగుతున్నాయి. పనులు ప్రారంభం కాని మిగితా చోట్ల ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో పనులు ప్రారంభించి మార్చి 15వరకు పనులు పూర్తయ్యేలా చూస్తాం.

– కిషన్, డీఆర్డీవో

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

- డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

మందమర్రిరూరల్: స్థానిక పీహెచ్‌సీని బుధవారం డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆసుపత్రి ఆవరణలోని గదులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని, సెంటర్ మ్యాపును అందుబాటులో ఉంచాలని తెలిపారు. వ్యాక్సినేషన్ కోసం ఉపయోగించే క్యారియర్లు సరిగ్గా ఉంచుకోవాలని, పాడైన వస్తువులు కమిటీ సమావేశంలో తీర్మానం చేసి తీసివేయాలని ఆదేశించారు. ఆపరేషన్ థియేటర్‌ను సందర్శించి ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రోజుల్లో ఆపరేషన్ థియేటర్‌ను తయారు చేసి స్టాఫ్‌నర్సులు ఉన్నందునా డెలివరీలు చేయాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలో జరిగే జాతరకు వైద్య సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. వైద్యాధికారి రమేష్, జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, వెంకటసాయి, వైద్య సిబ్బంది ఉన్నారు.

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వచ్చే రోగులకు సరైన వైద్యం అందేలా చూడాలని, అసంక్రమణ వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ, సరిపడా మందులను అందుబాటులో ఉంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని బుధవారం సందర్శించి, ఆసుపత్రికి వచ్చే రోగులకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్చంద్రారెడ్డి, ఆర్‌ఎంవో డాక్టర్ శ్రీమన్నారాయణ, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, 108 జిల్లా కోఆర్డినేటర్ సంపత్ కుమార్ పాల్గొన్నారు. జిల్లాకు ఇటీవల వచ్చిన అత్యాధునిక నూతన 108 అంబులెన్స్ వాహనంను డీఎంహెచ్‌వో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో 108 ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్, బి. సంపత్, ఈఎంటి సత్యనారాయణ, పైలట్ సతీశ్ పాల్గొన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

మహిళల చట్టాలపై అవగాహన ఉండాలి

మంచిర్యాలటౌన్: పిల్లలు, మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకోవడంతో పాటు, పలు చట్టాలను అమలు చేస్తుందని, మహిళలు, బాలికలకు వర్తించే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మహిళా సాధికారత హబ్ జెండర్ స్పెషలిస్టు విజయ అన్నారు. జిల్లా కేంద్రంలో మహిళా సమాఖ్య సభ్యులకు బుధవారం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఫైనాన్స్ లిటరసీ కార్యక్రమ ప్రతినిధి లిప్సికతో కలిసి హాజరై అవగాహన కల్పించారు. గర్భస్థ శిశువు లింగనిర్ధారణ చట్టం, లింగ వివక్షత, లింగ సమానత్వం, బాల్య వివాహాల నిరోధక చట్టం, సైబర్ క్రైం, సఖి సర్వీసెస్ హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన నంబర్ 1098, మహిళా హెల్ప్‌లైన్ 1930, పోక్సో యాక్ట్ హెల్ప్‌లైన్ ఎమర్జెన్సీ నంబర్ 112 వంటి వాటిని వివరించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్‌టచ్‌ను వివరించాలని తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న విజయ

కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం మత్తు, మానసిక ఒత్తిడి, కుష్ఠువ్యాధి నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఒత్తిడికి గురికావొద్దని సూచించారు. ధూమపానం, మత్తు పదార్థాలు వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా పారా మెడికల్ అధికారి రాఘవయ్య, కమ్యూనిటీ హెల్త్ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా హెల్త్ ఎక్సటెన్షన్ అధికారి లక్ష్మయ్య, రఘుపతి, డాక్టర్ సాయిప్రసన్న, స్టాఫ్ నర్సు శరణ్య, ప్రిన్సిపాల్ మోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

- సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు

పాతమంచిర్యాల: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలు అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి అజ్మీర లాల్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో బుధవారం సమావేశం నిర్వహించి చలో హైదరాబాద్ బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరించారు. హామీలు అమలు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 20న హైదరాబాద్‌లో నిర్వహించే చలో హైదరాబాద్ ప్రజాప్రదర్శన, బహిరంగ సభను అన్ని వర్గాల ప్రజలు, ప్రజాస్వామికవాదులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి బ్రహ్మానందం, నాయకులు మేకల రామన్న, జాఫర్, పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ, జిల్లా అధ్యక్షురాలు జ్యోతి, కార్యదర్శి అరుణ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లన్న, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి తిరుపతి, నాయకులు ప్రకాశం, చరణ్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు



నెన్నెల: పూనకాలతో నృత్యం చేస్తున్న శివసత్తులు



జాతరలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

సమ్మక్క-సారలమ్మ చిన్న జాతర

మంచిర్యాలఅర్బన్/నెన్నెల/భీమిని: సమ్మక్క-సారలమ్మ మినీజాతర బుధవారం ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలోని గోదావరి నది తీరాన, నెన్నెల శివారులోని ప్రకృతివనం వద్ద, కన్నెపల్లి మండలంలోని ముత్తపూర్ గ్రామ పరిధిలో జాతర జరుగుతుండగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సల్లంగా చూడాలని వేడుకున్నారు.

క్రైం కార్నర్..



ఒకరిపై అట్రాసిటీ కేసు

మంచిర్యాలక్రైం: మంచిర్యాలకు చెందిన ఓ మహిళను ప్రేమ పేరుతో మోసం చేసిన వ్యక్తిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు స్థానిక సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మంచిర్యాలకు చెందిన తాటికొండ రాంచందర్ నాలుగు సంవత్సరాలుగా ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని బాధితురాలు బుధవారం ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు రాంచందర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రిపోర్టర్‌పై దాడి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్‌లో ఈ నెల 11న ఓ రిపోర్టర్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడినట్లు స్థానిక ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బైపాస్ రోడ్‌లో గొడవ జరుగుతోందని తెలియగా సీసీసీ నస్పూర్‌కు చెందిన రిపోర్టర్ సబ్బాని భాస్కర్ సమాచారం సేకరించేందుకు వెళ్లాడు. అక్కడ కొందరిని గొడువ ఎందుకు జరిగిందని అడిగినందుకు, అక్కడే ఉన్న కొందరు గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేసి చంపేస్తామని బెదిరించినట్లు తెలిపారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

పేకాటశిబిరంపై...

లక్సెట్టిపేట: మండలంలోని బలరావుపేట గ్రామ శివారులో పేకాట శిబిరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న రమేష్, తిరుపతి, రాజయ్య, ఓదయ్య, మల్లేష్, సుధాకర్, సత్తన్నను అరెస్ట్ చేసినట్లు ఎస్సై సతీష్ తెలిపారు. వారి వద్ద నుంచి ఐదు బైకులు, ఆరు ఫోన్లు, రూ.పదమూడు వేలు నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

21మందిపై కేసు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నబ్బెపల్లి శివారులోని కర్ణమామిడికి వెళ్లే మార్గంలో అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో శివాజీ విగ్రహం ఏర్పాటుకు భూమిని తవ్వారు. హాజీపూర్ పంచాయతీ కార్యదర్శి నాగరాజు ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం 21మందిపై కేసు నమోదు నమోదు చేసినట్లు హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ తెలిపారు.

రూ.50వేలు జరిమానా

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం గోమాస శంకర్ పొలంలో సంబంధిత అధికారుల అనుమతులు లేకుండా మట్టి తవ్వుతున్న జేసీబీని రెవెన్యూ అధికారులు సీజ్ చేసి పోలీస్ కస్టడీకి అప్పగించారు. జిల్లా మైనింగ్ శాఖ అధికారులకు రూ.50వేలు జరిమానా చెల్లించాలని జేసీబీ యజమానికి తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

సంక్షిప్త వార్తలు

విద్యుత్ కార్మికుల ప్లాటినం జుబ్లీ వేడుకలు

జన్నారం/దండేపల్లి/లక్సెట్టిపేట: టీఈఈ 1104 యూనియన్ విద్యుత్ కార్మికులు బుధవారం ప్లాటినం జుబ్లీ(75 సంవత్సరాల) వేడుకలను జరుపుకున్నారు. జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేటలో ఆయా కార్యాలయ ఆవరణలో జెండా ఎగురవేశారు.

16న సీపీఐ నియోజకవర్గ సమావేశం

శ్రీరాంపూర్: ఈ నెల 16న సీపీఐ పార్టీ మంచిర్యాల నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి పూజారి రామన్న, సహాయ కార్యదర్శి లింగం రవి తెలిపారు. శ్రీరాంపూర్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం శ్రీరాంపూర్‌లోని పార్టీ కార్యాలయంలో దీనికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు.

నేడు రాజకీయ పార్టీలతో సమావేశం

కాసిపేట: మండలంలో రెండో విడత సాధారణ ఎన్నికలు 2025 ఎంపీటీసీ, జెడ్పీటీసీల వారీగా డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాలపై గురువారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణసింగ్ తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో నిర్వహించే సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులు హాజరై అభ్యంతరాలు సూచించాల్సిందిగా తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక

లక్సెట్టిపేట/వేమనపల్లి: నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు వేమనపల్లి మండలం నీల్వాయి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని కోడూరి నేహస్వీత, లక్సెట్టిపేట మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న దుర్గం వర్షిత్ ఎంపికైనట్లు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు గిరిధర్ రెడ్డి, యశోధర తెలిపారు. విద్యార్థులకు ఐదు సంవత్సరాల పాటు ప్రతీ సంవత్సరం రూ.12,000 ప్రభుత్వ అందజేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులను బుధవారం ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభినందించారు.

బర్డ్‌ఫ్లూపై అప్రమత్తంగా ఉండాలి

జన్నారం: బర్డ్‌ఫ్లూతో కోళ్లు మృత్యువాత పడుతున్నందున మండలంలోని పౌల్ట్రీ ఫారం యజమానులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పలు పౌల్ట్రీ ఫారాలను పరిశీలించారు. యజమానులకు సూచనలు చేశారు. జన్నారంలో ఇప్పటివరకు బర్డ్‌ఫ్లూ సోకినట్లు ఎటువంటి సమాచారం లేదన్నారు.

అర్చకుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

మంచిర్యాలఅర్బన్: చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేసిన వీర రాఘవరెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ హిందూ ఐక్యవేదిక, అర్చకుల ఆధ్వర్యంలో బుధవారం హమాలీవాడలో నిరసన వ్యక్తం చేశారు. అర్చకుడిపై దాడిని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో అర్చకులు సంతోష్, సంగర్కర్ శర్మ, రమేష్ శర్మ, శ్రీనివాస్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నల్ మార్కుల పరిశీలన

దండేపల్లి: దండేపల్లి కస్తూర్బా పాఠశాలలోని పదోతరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులను జిల్లా తనిఖీ బృందం బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో తనిఖీ బృందం సభ్యులు సుదర్శన్, శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సీఎండీకి యూనియన్ నేతల వినతులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ పర్యటనకు వచ్చిన సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌కు బుధవారం పలువురు యూనియన్ నాయకులు కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, యూనియన్ ప్రధాన కార్యదర్శి ఏనుగు రవీందర్ రెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ గరిగే స్వామి, కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జీ తిరుపతి రాజు, నాయకులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో..

టీబీజీకేఎస్ నాయకులు ఆర్కే 7 గనిపై సీఎండీ బలరాంనాయక్‌కు కలిసి వినతిపత్రం సమర్పించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ సింగరేణిలో 11వ వేజ్ బోర్డు పరిధిలో రిటైర్డ్ అయిన, మరణించిన ఉద్యోగులకు పెన్షన్ రివైజ్ చేసి అప్పటి నుండి రావాల్సిన పెన్షన్ ఏరియర్స్‌ను చెల్లించాలని కోరారు. యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

వేతనం పెంచాలని వినతి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు 345మంది ఉండగా, వారి వేతనాలను పెంచాలని కోరుతూ తెలంగాణ మున్సిపాలిటీ కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం కార్మికులు కమిషనర్ శివాజీకి వినతిపత్రం అందించారు. సమానపనికి సమాన వేతనం చట్టం ప్రకారం ప్రతి కార్మికునికి రూ.26వేల వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం వేతనాలు చెల్లించేలా చూడాలని కోరారు. పులివైల సాయికిరణ్ అనే వ్యక్తి మున్సిపాలిటీకి ఎలాంటి సంబంధం లేకుండానే అడ్డదారిలో మున్సిపల్ కార్యాలయంలో, ఈపీఎఫ్‌లో పేరు నమోదు చేసుకొని ఏడాదిగా కార్మికుని వేతనం పొందుతూ కమిషనర్ కారు డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడని, అతడిని వెంటనే పారిశుద్ధ్య విభాగానికి పంపించాలని కోరారు.

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి

కాసిపేట: గ్రామాల్లో, ప్రధాన కూడలల్లో సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి అని దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు అన్నారు. మండలంలోని దేవాపూర్ గొల్లవాడలో బుధవారం నాలుగు కమ్యూనిటీ సీసీ కెమెరాలు ప్రారంభించారు.